క్లుప్తంగా

కబడ్డీ పోటీలకు ఎంపిక



కబడ్డీ క్రీడాకారులతో పీఈటీ ఉదయకుమార్

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట జెడ్పీ హైస్కూల్ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. అప్పినపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు జూనియర్ బాయ్స్, గర్ల్స్ అండర్-14 విభాగంలో విన్నర్స్, సీనియర్ గర్ల్స్ అండర్-17 లో రన్నర్స్‌గా నిలిచినట్లు హెచ్‌ఎం నందకుమార్ తెలిపారు. ప్రతిభ కనబరచిన 10 మంది క్రీడాకారులను పలమనేరు నియోజకవర్గ స్థాయిలో జరిగే ఎస్‌జీఎఫ్, జోనల్ పోటీలకు ఎంపిక అయ్యారని వ్యాయామోపాధ్యాయుడు ఉదయ కుమార్ తెలిపారు. విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు.

16న విజయవాడ ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

పుంగనూరు: స్థానిక డిపో నుంచి విజయవాడకు ఆర్టీసీ సర్వీసు నడుపుతున్నట్లు డీఎం సుధాకరయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పుంగనూరు నుంచి సోమల, సదుం, పీలేరు, తిరుపతి మీదుగా విజయవాడకు సూపర్ లగ్జరీ బస్సును ఈనెల 16 నుంచి నడుపుతామన్నారు. ఈ సర్వీసు సాయంత్రం 5 గంటలకు బయలుదేరుతుందని, దీనిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పుంగనూరు టు హైదరాబాద్ సర్వీసును రద్దు చేసినట్లు తెలిపారు.

కరెన్సీ వినాయకుడు



పలమనేరు: పట్టణంలోని చిన్నగాండ్లవీధిలో నిర్వాహకులు రూ.21లక్షల కరెన్సీనోట్లతో వినాయకుని విగ్రహాన్ని శుక్రవారం అలంకరించారు. విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రదీప్, కిశోర్, గణేష్, మూర్తి, హేమంత్ పాల్గొన్నారు.

హిందీ భాషా దినోత్సవం

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. హిందీ అధ్యాపకురాలు స్రవంతి మాట్లాడుతూ, హిందీ జాతీయ భాషగా కొనసాగుతోందని, ఈ భాషను నేర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు మాతృభాషతో సహా ఇతర జాతీయ భాషలను నేర్చుకోవడంతో భవిష్యత్తులో వారి అభ్యున్నతికి ఉపయోగపడుతుందన్నారు.

కామ్రేడ్ ఏచూరికి రెడ్ సెల్యూట్



నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

పలమనేరు: కామ్రేడ్ ఏచూరి సీతారాం సేవలు కమ్యూనిస్టులకు మార్గదర్శకమని సీపీఎం జిల్లా కమిటీ నేతలు ఓబుల్‌రాజు, గిరిధర్‌గుప్తా అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఏచూరి సేవలను స్మరించారు. ఆయన మృతి చెందడం పార్టీకి తీరనిలోటన్నారు. విద్యార్థి దశ నుంచి చివరి వరకు ఉద్యమాలే ఊపిరిగా పనిచేసిన ఎందరికో ఆదర్శంగా నిలిచారని కీర్తించారు. కార్యక్రమంలో సావిత్రి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ



పుంగనూరు: వక్ఫ్ బోర్డు చట్టాన్ని రద్దు చేసి, ముస్లింల ఆస్తులకు, వారి మనుగడకు విఘాతం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం చేస్తోందని, ఆ చట్టాన్ని అమలు చేస్తే ఆందోళన తీవ్రం చేస్తామని యువజన కాంగ్రెస్ నాయకులు అయూబ్, అల్తాఫ్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీలో నాయకులు ఇమ్రాన్, ఫిరోజ్, సుహేల్, సాధిక్, బల్లు, దాదు, అక్బర్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్ఆర్డర్లు క్లోజ్ చేయండి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో 2020–2021కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వర్క్ఆర్డర్లను ఏఈలు ఈ నెలలోపు క్లోజ్ చేయాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు ఆదేశించారు. శుక్రవారం ట్రాన్స్‌కో అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వివిధ అంశాలపై సమీక్షించారు. ఎస్ఏఓ శ్రీనివాసులు, ఈఈలు శ్రీనివాసులురెడ్డి, మునిచంద్ర, హరి, రవికుమార్, డీఈలు శేషాద్రి, ఆనంద్, జ్ఞానేశ్వర్, జయప్రకాష్ పాల్గొన్నారు.

వైద్య విద్యపై కక్ష ఎందుకు?



డాక్టర్ అవ్వాలని ఎంతో కష్టపడి నీట్‌కు ప్రిపేర్ అయిన విద్యార్థులకు ఈ ప్రభుత్వం మోసం చేస్తోంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలుంటే ఎంబీబీఎస్ సీట్లు పెరిగి తక్కువ కటాఫ్‌లో ఉన్న వాళ్లు సీట్లు లభించేవి. కానీ కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రోత్సహించకుండా ప్రైవేటు పరం చేస్తూ పేద పిల్లలకు అన్యాయం చేస్తోంది. గత ప్రభుత్వంపై కక్ష సాధింపుల్లో భాగంగా పులివెందుల మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయడం సరైన నిర్ణయం కాదు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

-వెంకటరెడ్డి, కల్లాడు, పలమనేరు మండలం



ప్రైవేట్ పరం చేయడం సరి కాదు



ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడం ఎంతమాత్రమూ సరికాదు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన వాటిని ప్రైవేట్ పరం చేయడం న్యాయమేనా? ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు తగ్గిస్తే నష్టపోయేది మేమే కదా! ప్రభుత్వ కాలేజీల్లో సీటు వస్తే బాగుంటుంది. ప్రైవేట్‌పరం చేసి పేద విద్యార్థులైన మా నుంచి అధిక ఫీజులు గుంజేందుకు చేస్తున్న కుట్రగా భావించాల్సి వస్తుంది. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలి.

-యామిని, నీట్ విద్యార్థిని, చిత్తూరు

రాత్రిపూట కేసులొస్తే రెఫర్లే దిక్కు!

- అందని ఎమర్జెన్సీ సేవలు
- చిన్నపాటి సమస్య ఉన్నా వెంటనే రెఫర్
- రోగిని కూడా చూడని నైట్ డ్యూటీ వైద్యులు
- సిబ్బంది సేవలూ అంతంత మాత్రమే
- రోగులు, సహాయకులకు తప్పని తిప్పలు
- ఇదీ పలమనేరు ఏరియా ఆస్పత్రి తీరు

పలమనేరు: నియోజకవర్గ ప్రజలకు వైద్యసేవలందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి, అత్యాధునిక వసతులతో నిర్మించిన ఏరియా ఆస్పత్రిలో రాత్రిపూట అత్యవసర వైద్యసేవలు మృగ్యమవుతున్నాయి. రాత్రుల్లో ఇక్కడికి వచ్చే రోగులకు ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సిన ఎమర్జెన్సీ డాక్టర్లు అస్సలు పట్టించుకోవడం లేదని, సిబ్బంది సైతం నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. రోగి రాగానే నిమిషాల వ్యవధిలో రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్న తీరు చూస్తే వైద్యసేవలు ఏ తీరులో ఉంటున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇది రోగులు, వారి సహాయకులకు శాపంగా మారుతోంది.

ఇవిగో సాక్ష్యాలు

- ఇటీవల బైరెడ్డిపల్లె మండలానికి చెందిన ఓ మహిళ కాన్పు నిమిత్తం ఇక్కడికి వచ్చింది. ఆమెను పరీశీలించిన వైద్యులు ఆమెకు రక్తం తక్కువగా ఉందని, కచ్చితంగా సిజేరియన్ చేయాలని చిత్తూరు తరలించారు. కానీ ఆమె జిల్లా ఆస్పత్రిలో నార్మల్ డెలివరీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శిశువుకు జన్మనిచ్చింది.
- పట్టణానికి చెందిన ఓ మహిళ ఛాతీలో నొప్పిగా ఉందంటూ బాధపడుతుంటే ఇక్కడికి తీసుకొచ్చారు. ఆమెను కనీసం అక్కడి డ్యూటీ డాక్టర్ చూడనేలేదు. చివరకు ఆమె భర్త గట్టిగా నిలదీయడంతో డ్యూటీ డాక్టర్ ఈసీజీ చేసి చిత్తూరుకు రెఫర్ చేశారు. అంతకుముందు రోగి భర్త ప్రాధేయపడినా అక్కడున్న నర్సులు అంటీముట్టనట్టు వ్యవహరించినట్టు తెలిసింది. దీంతో ఆమెను ఇక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమెకు అసలు ఛాతీనొప్పి లేదని, కేవలం ఎసిడిటీ సమస్య అని చికిత్స చేసి ఇంటికి పంపారు.
- పలమనేరు మండలం అటవీప్రాంత గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాముకాటుకు గురై ఇక్కడి ఆస్పత్రికి రాగా పరిస్థితి విషమంగా ఉందని పెద్దపంజాణి మండలం గుట్బూరు క్రిస్టియన్ ఆస్పత్రికి పంపారు. అక్కడ వారి వైద్యం చేసి ఇంటికి పంపించారు.
- ఇక్కడి డాక్టర్లు రెఫర్లకే ప్రాధాన్యతనిస్తూ అత్యవసరమైన వైద్యసేవల జోలికి వెళ్లడం లేదు.



పలమనేరు ఏరియా ఆస్పత్రి

పేరుకే ఎమర్జెన్సీ సేవలు

ఇక్కడి ఏరియా ఆస్పత్రికి తరచూ రాత్రుల్లో చైన్నై–బెంగళూరు హైవేలో జరిగే రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులు ఎక్కువగా వస్తుంటారు. దీంతోపాటు గుండెపోట్లు, ఆత్మహత్యలకు పాల్పడిన వారు ఎక్కువగా వస్తుంటారు. ఇక ఆపరేషన్ల కేసులకు ఈ ఆసుపత్రే దిక్కుగా ఉంది. ఇక్కడి అత్యవసర విభాగంలో ఓ డాక్టర్ రాత్రిపూట డ్యూటీలో ఉండాలి. కానీ డ్యూటీలోని డాక్టర్లు రోగి రాగానే స్పందించరు. కేవలం నర్సులు మాత్రం రోగిని చూడకుండానే 'ప్రథమ చికిత్స చేసి సార్ పడుకున్నారు.. మేం లేపలేం మీరే లేపుకోండి..' అనే మాట వినిపిస్తోంది. ఆపై డాక్టర్ వచ్చినా చేసేదేమీ ఉండదు. కేవలం రిజిస్టర్‌లో నమోదు చేసి పెద్దాసుపత్రులకు ఇక్కడి నుంచి రెఫర్ చేసేస్తున్నారు. ఇంత మాత్రానికి ఈ ఆస్పత్రి ఎందుకు కట్టినట్టు? అని జనం ప్రశ్నిస్తున్నారు.

ఇదీ పలమనేరు ఆస్పత్రి సమాచారం

ఆస్పత్రి విస్తీర్ణం	:	6.2 ఎకరాలు
ఇక్కడ మొత్తం బెడ్లు	:	వంద
రెగ్యులర్, ట్రైనీ డాక్టర్లు	:	19 మంది
స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు	:	27మంది
ఆస్పత్రిలో ఇతర సిబ్బంది	:	150 వరకూ
సెక్యూరిటీ సిబ్బంది	:	8 మంది
రోజువారీ ఓపీ	:	దాదాపు 500
ఇన్‌పేషెంట్లు	:	110మంది వరకు

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

రాత్రి సమయంలో వచ్చే రోగులకు సరైన ట్రీట్‌మెంట్ చేయడం లేదని ఇటీవల ఫిర్యాదులు వచ్చాయి. కొందరు డాక్టర్ల తీరు కారణంగా మాట పడాల్సి వస్తోంది. దీనిపై డాక్టర్లు, సిబ్బందికి ఇటీవలే మీటింగ్ పెట్టి హెచ్చరించాం కూడా. ఇకపై ఇలాంటివి పునరావృతమైతే బాధితులు నేరుగా నాకు ఫిర్యాదు చేయవచ్చు.

–డాక్టర్ మమతారాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్, పలమనేరు

ఇకపై రెఫర్ కేసులు లేకుండా చూస్తాం

ఆస్పత్రుల్లో రోగుల సేవల కోసం 24 గంటలూ పనిచేసే ఆస్పత్రి ఇది. కానీ రాత్రిపూట అత్యవసర సేవల్లో ఇబ్బందులున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా రాత్రుల్లో డ్యూటీలు చేసే డాక్టర్లు, సిబ్బంది కేసులను రెఫర్ చేయకుండా ఇక్కడే అవసరమైన ట్రీట్‌మెంట్ ఇచ్చేలా చూస్తాం.

–డాక్టర్ శారద, ఆర్ఎంఓ, పలమనేరు

నేడు జాతీయ లోక్ అదాలత్

పలమనేరు: పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టు, పట్టణ సమీపంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం కోర్టు వద్ద ఆయన మాట్లాడారు. కక్షిదారులు పంతాలు, పట్టింపులకు పోకుండా రాజీయే రాజమార్గంగా భావించాలన్నారు. ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని, చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పలమనేరు: పలమనేరు ట్రాన్స్‌కో పరిధిలోని పలమనేరు, వీ.కోట, బైరెడ్డిపల్లె, గంగవరం మండలాల్లో శనివారం సబ్‌స్టేషన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

లక్కీడిప్ విజేతలకు బహుమతులు



బహుమతులు పంపిణీ చేస్తున్న డిపో మేనేజర్

పుంగనూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారంలక్కీడిప్ నిర్వహించారు. మేటిమంద–కలికిరి, పుంగనూరు–ముళబాగిల్ రూట్లలో ప్రయాణించిన వారి టికెట్లను డిపో మేనేజర్ సుధాకరయ్య డిప్ తీసి విజేతలను ఎంపిక చేశారు. శ్రీలత, అనూష, సత్యనారాయణలకు బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరూ సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో వెళ్లాలని డీఎం కోరారు.

ఉలవల కోసం ఆందోళన

బైరెడ్డిపల్లె: ప్రభుత్వం రాయితీతో సరఫరా చేస్తున్న ఉలవలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని లక్కనపల్లె రైతుసేవా కేంద్రం వద్ద శుక్రవారం రైతులు ఆందోళన చేశారు. రైతులు మాట్లాడుతూ, ఉలవలు సాగు చేసేందుకు అప్పులు చేసి దుక్కులు దున్నుకున్నామన్నారు. అయితే వారం రోజులుగా ఉలవలు కోసం రైతు సేవా కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పంపిణీ చేయడం నిరసించారు. వ్యవసాయశాఖ అధికారులను కలిసినా ఫలితం శూన్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే తాము ఆందోళనబాట పట్టామని, ఇకనైనా ఉలవలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.



లక్కనపల్లె రైతు సేవా కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

గంగమ్మకు రాహుకాల అభిషేక పూజలు



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. ఆలయానికి మామిడి, వేపాకుతో తోరణాలు కట్టి రాహుకాల సమయంలో శాస్త్రోక్తంగా అర్చనలు ,అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో అమ్మవారికి అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. వారికి ఉచిత అన్నప్రసాదాల వితరణ చేశారు. ఈఓ ఏకాంబరం పర్యవేక్షించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

- కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం
- మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: వైఎస్సార్ సీపీ అధికారంలో లేదని కార్యకర్తలు, నాయకులు అధైర్యపడాల్సిన పనిలేదని, ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ భరోసానిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులపై సమావేశం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో నాయకులు హేమంత్‌కుమార్ రెడ్డి, మండీసుధా, కోదండరామయ్య, బాగారెడ్డి, గిరిరాజారెడ్డి, చెంగారెడ్డి, ప్రహ్లాద, చంద్రప్ప, వినోద్, నరేష్, నయాజ్, హేమంత్, హైదర్ తదితరులు పాల్గొన్నారు.



జయశంకర్‌ను అభినందిస్తున్న వెంకటేగౌడ

అభినందన

పలమనేరు: లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎంపికైన పట్టణానికి చెందిన జయశంకర్‌ను మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ శుక్రవారం సన్మానించి అభినందించారు. క్లబ్‌తో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని ఆయనకు సూచించారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం





ఆవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

వి.కోట: బాల్య వివాహాలు అనర్థదాయకమని, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ మాధవీలత అన్నారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత సమస్యలు, పౌష్టికాహార ఆవశ్యకత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 గురించి ఆమె అవగాహన కల్పించారు. అనంతరం చేతుల పరిశుభ్రత, నులిపురుగు నివారణ చర్యలకు వాడాల్సిన ఆల్బెండజోల్ మాత్రల గురించి, ఐరన్ మాత్రల ఆవశ్యకత గురించి మెడికలాఫీసర్ డాక్టర్ సుస్మిత వివరించారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దామోదరం నాయుడు, అంగన్ వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



హిందీ దివస్‌ను నిర్వహిస్తున్న టీచర్లు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీచర్లు, విద్యార్థులు హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. హిందీ టీచర్లు కిరణ్‌కుమార్, ముంతాజ్ మాట్లాడారు. జాతీయ భాష హిందీని నేర్చుకుంటే పలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశం ఉంటుందన్నారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రభాకర్ రెడ్డి బహుమతులను అందజేశారు.

నిమజ్జనం

బైరెడ్డిపల్లె: వినాయక చవితి పండుగ సందర్భంగా స్థానిక బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శుక్రవారం కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం ట్రాక్టర్‌లో విగ్రహాన్ని కొలువు దీర్చి, యువకులు రంగులు చల్లుకుంటూ, గ్రామ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక నాయుడు క్వార్టర్స్ వద్ద నెలకొల్పిన గణనాథుడికి శుక్ర వారం ఘనంగా వీడ్కోలు పలికారు. వినాయకుడిని ట్రాక్టర్‌లో రంగురంగుల పూల నడుమ ముత్యాల పల్లకిలో ముస్తాబు చేశారు. డ్రమ్స్, వాయిద్యాలు, డ్యాన్స్ హంగామా నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.



బైరెడ్డిపల్లెలో గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

గంగవరంలో..

గంగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీవరసిద్ధి వినాయకస్వామి జలధి కార్యక్రమాలు వేడుకగా సాగుతున్నాయి. కల్లుపల్లె దళితవాడలో కొలువుదీరిన సిద్ధి వినాయకుని జలధి శుక్రవారం డప్పుల హోరు, బాణసంచా మోత నడుమ గ్రామ సమీపంలోని చెరువులో పూర్తి చేశారు. అన్నదానం చేశారు.



చౌడేపల్లె: నిమజ్జనానికి తరలుతున్న బొజ్జ గణపయ్య



గంగవరం: జలధికి బయలుదేరిన వినాయకస్వామి, భక్తులు

విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దాలి



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులతో పలమనేరు ఎమ్మెల్యే

బైరెడ్డిపల్లె: సమయపాలన పాటిస్తూ విద్యార్థులను క్రమశిక్షణలో తీర్చిదిద్ది ఉన్నత స్థాయికి తీసుకువచ్చే బాధ్యత గురువులపై ఉందని పలమనేరు ఎమ్మెల్యే ఎస్.అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానికంగా ఒక కళ్యాణ మండపంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన టీచర్లనుసత్కరించి, జ్ఞాపికలు అందజేసి మాట్లాడారు. టీచర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సమాజాభివృద్ధిలో గురువుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఎంఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యం, టీచర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

పెద్దపంజాణి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం మండలంలోని రాయలపేట–3 అంగన్‌వాడీ కేంద్రం, జెడ్పీ హైస్కూల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పౌష్టికాహార లోపం, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. తక్కువ ఖర్చుతో తయారు చేసిన పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. కిశోర బాలికల్లో రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలతో కూడిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రత్నమ్మ, వైద్యాధికారి మౌనిక, సూపర్‌వైజర్లు శారద, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని